క్లుప్తంగా

ఓటు హక్కు ప్రాధాన్యతపై విద్యా సంస్థల్లో అవగాహన



నెహ్రూనగర్: కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని పలు విద్యా సంస్థల్లో ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం) కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని సూచించారు. స్వీప్ ద్వారా విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, సూపర్వైజరీ అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఏసీ లా కళాశాలలో వెబ్ ఆప్షన్ల నమోదుకు అనుమతి

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ లా కళాశాలలో ప్రవేశాలకు సంబంధించి వెబ్ ఆప్షన్ల నమోదుకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నుంచి అనుమతి లభించినట్లు కరస్పాండెంట్ జి.ఎలీషా, ప్రిన్సిపాల్ అమృతవర్షిణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లాసెట్‌లో అర్హత పొందిన విద్యార్థులు మూడేళ్లు, ఐదేళ్ల లా కోర్సుల్లో ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం ఉందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

డ్రైవర్లంతా అప్రమత్తతతో వ్యవహరించాలి



పట్నంబజారు: శిక్షణ పొందిన డ్రైవర్లంతా వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపాల్ చెప్పారు. నగరంలోని శ్రీ సాయి మారుతి హెవీ మోటారు డ్రైవింగ్ స్కూలులో శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ గోపాల్ మాట్లాడుతూ పూర్తి స్థాయిలో రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రయాణికుల్ని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐలు మల్లేశ్వరి, సౌజన్య పాల్గొన్నారు.


జీజీహెచ్‌లో ఆరోగ్యమిత్రలకు బయోమెట్రిక్

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో పనిచేసే ఆరోగ్య మిత్రలకు డిసెంబర్ 1 నుంచి ఎఫ్ఆర్ఎస్, బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ఆసుపత్రిలోని జగనన్న ఆరోగ్య సురక్ష సమాచార కేంద్రానికి వచ్చే రోగులకు ఆరోగ్య మిత్రలు సేవలు అందించే విషయంలో అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలపై స్పందించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బయోమెట్రిక్ హాజరు అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

జీజీహెచ్‌లో జనరిక్ మందుల షాపు ప్రారంభం

గుంటూరు మెడికల్: జీజీహెచ్ క్యాజువాలిటీ ఎదుట డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపును జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా చౌక ధరలో జనరిక్ మందుల్ని రోగులకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య కమిటీ అధ్యక్షురాలు ఏ.శారమ్మ, కార్యదర్శి ఎం.ఝాన్సీరాణి, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, జనరిక్ మందుల షాపు ఇంచార్జి షంషేర్, స్త్రీ నిధి డైరెక్టర్ కె. అరుణ, జిల్లా సమాఖ్య కమిటీ సంయుక్త కార్యదర్శి చల్లా వాసంతి, కార్యవర్గ సభ్యులు కాకుమాను భూదేవి, బి. నాగరత్నం, జి. మల్లీశ్వరి పాల్గొన్నారు.

పురస్కారానికి రచయిత్రి సుజాత ఎంపిక



పాత గుంటూరు: గుంటూరుకు చెందిన రచయిత్రి ఏవీకే సుజాత ఒంగోలు కళా మిత్ర సంస్థ వారి రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 26న ఒంగోలులో జరగనున్న కార్యక్రమంలో ఆమె పురస్కారాన్ని అందుకోనున్నారు. అమృత హృదయం, వ్యాస సుమాలు, నవ్యాంధ్ర నానీలు, బాలల కవితలు పుస్తకాలను ఆమె రాశారు. నవ్యాంధ్ర రచయితల సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. అనేక ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాల్లో సుజాత వ్యాఖ్యాతగా వ్యవహరించి ప్రముఖులు, ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. ఆమె పురస్కారానికి ఎంపిక కావడంపై నవ్యాంధ్ర రచయితల సంఘ జిల్లా అధ్యక్షురాలు వేదాల విజయలక్ష్మి, సభ్యులు దుర్గాదేవి, లావణ్య, సీహెచ్. ఝాన్సీ, నాగసాయి అభినందనలు తెలిపారు.

రోడ్ల విస్తరణ వేగవంతం చేయండి

నగర కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా ఈఈలు బాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. తన క్యాంప్ కార్యాలయంలో శనివారం కమిషనర్ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత పనుల్ని ఈఈల వారీగా సమీక్షించారు. కొన్ని ప్రాంతాల్లో కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువు మేరకు పనులు చేయడంలేదని, జాప్యం జరిగితే ప్రజలు ఇబ్బందులకు గురవుతారని చెప్పారు. ఈఈలు తమ పరిధిలోని ఇంజినీరింగ్ అధికారులతో పనుల వారీగా సమీక్షించుకొని, వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏటీ అగ్రహారం, కుగ్లర్ హాస్పిటల్, పెద్దపలకలూరు రోడ్లలో పెండింగ్ పనులు పూర్తి చేయడానికి ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సంయుక్త కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. పనులు జరిగే క్రమంలోనే నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఎమినిటీ కార్యదర్శులు పనుల్ని ఆయా స్టేజీల్లో రికార్డ్ చేయాలని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే బిల్లుల చెల్లింపు నిలివేయడంతో పాటు పర్యవేక్షణ అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనుల్ని ఎప్పటికప్పుడు బిల్స్ కోసం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ భాస్కర్, ఈఈలు సుందరరామిరెడ్డి, కొండారెడ్డి, శ్రీనివాస్, ఏసీపీ అజయ్ కుమార్, డీఈఈలు, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

నకిలీ చిరునామాలతో డెలివరీ చలానాలు

- 80 గ్యాస్ సిలిండర్ల లారీ స్వాధీనం
- నిత్యావసర సరుకుల చట్టం కింద కేసులు నమోదు



సిలిండర్ల లారీ వద్ద సీఐ శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు

నగరంపాలెం: నకిలీ చిరునామాలతో డెలివరీ చలానాలున్న గ్యాస్ సిలిండర్ల లారీని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు ప్రాంతీయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు శనివారం విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు నగరంపాలెంలోని చౌకింగ్ హోటల్ వద్ద గ్యాస్ సిలిండర్ల లారీని తనిఖీ చేశారు. నకిలీ చిరునామాలతో డెలివరీ చలానాలను గుర్తించారు. వ్యాపార అవసరాలకు వాడే గ్యాస్ సిలిండర్లు దుర్గా సాయి గ్యాస్ ఏజెన్సీ (సూపర్ గ్యాస్) విజయవాడ చిరునామాతో ఉన్నాయి. అందులో గ్యాస్ కిట్, బరువు కొలిచే యంత్రం, అగ్నిమాపక పరికరాలు లేకపోవడాన్ని గుర్తించినట్లు విజిలెన్స్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. లారీలో పరిమితికి మించి గ్యాస్ సిలిండర్లు ఉన్నాయని చెప్పారు. దీంతో 71 ఫుల్ గ్యాస్ సిలిండర్లు, తొమ్మిది ఖాళీ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. నిత్యావసర సరుకుల చట్టం 6–ఎ కింద కేసులు నమోదు చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారుల్ని ఆదేశించారు. తనిఖీల్లో విజిలెన్స్ తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద మెనూ విధిగా పాటించాలి



గుంటూరు ఎడ్యుకేషన్: జగనన్న గోరుముద్ద మెనూ విధిగా పాటించి, విద్యార్థులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించాలని ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం ఉపాధ్యాయులకు సూచించారు. ఏటీ అగ్రహారంలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేసి, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం పాఠశాల రికార్డులతో పాటు విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

నగర వైద్యులకు ఐఎంఏ అవార్డులు



మెడల్‌తో డాక్టర్ వై. షేక్



అవార్డు అందుకుంటున్న డాక్టర్ షమా సుల్తానా

గుంటూరు మెడికల్: నగర వైద్యులకు ఇద్దరికి ఐఎంఏ అవార్డులు లభించాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వార్షిక వేడుకలు శుక్రవారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించారు. వేడుకల్లో పలు రంగాల్లో రాణిస్తున్న వైద్యుల్ని సన్మానించి, అవార్డులు అందజేశారు. అతి తక్కువ ధరకే వైద్యసేవలు అందిస్తూ యువనారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు, హెల్త్ అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ షమా సుల్తానాకు అవార్డును అందజేశారు. వేడుకల్లో భాగంగా 24న వైద్యులకు జాతీయస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించారు. టెన్నిస్ డబుల్స్‌లో గుంటూరుకు చెందిన గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, నేషనల్ లివర్ అండ్ గ్యాస్ట్రో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై. షేక్‌కు సిల్వర్ మెడల్ లభించింది. అవార్డులు అందుకున్న వైద్యుల్ని పలువురు నగర వైద్యులు అభినందించారు.

అరండల్‌పేట సీఐగా వెంకటేశ్వరరెడ్డి



గుంటూరు ఈస్ట్: అరండల్‌పేట పోలీస్ స్టేషన్ సీఐగా ఐ.వెంకటేశ్వరరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. 1998లో ఎస్ఐగా విధుల్లో చేరిన ఆయన 2011లో పదోన్నతి పొందారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట సీఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై అరండల్‌పేట వచ్చారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



పట్నంబజారు: విద్యార్థుల్ని తరలిస్తున్న ఆటోల్ని శనివారం నగర ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈస్ట్ సబ్ డివిజన్ సీఐ కోటేశ్వరరావు, వెస్ట్ సబ్ డివిజన్ సీఐ కె.శ్రీనివాసరావు నేతృత్వంలో నగరంలోని ముఖ్య కూడళ్లలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. అనుమతులకు మించి తరలిస్తున్న వాహనాల్ని నిలువరించి, ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పలువురికి జరిమానాలు విధించారు.

అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం



నాగజ్యోతిని అభినందిస్తున్న రామకృష్ణప్రభు, మాజేటి ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: ఏఎన్‌యూలో ఇటీవల జరిగిన అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గుంటూరు చలమయ్య–కర్నూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థిని తుపాకుల నాగజ్యోతి బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు తెలిపారు. సంగడిగుంటలోని కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ కర్నూరపు రామకృష్ణప్రభు మాట్లాడుతూ తమ విద్యార్థిని 81 కేజీల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని విద్యతో పాటు క్రీడల్లో సైతం రాణించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి మాజేటి ప్రసాద్, విద్యార్థిని తండ్రి తుపాకుల శ్రీనివాసరావు, కోచ్ కమ్రుద్దీన్ పాల్గొన్నారు.

330 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

డీలర్‌పై క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశాలు



అక్రమంగా నిల్వ చేసిన బియ్యం బస్తాల వద్ద విజిలెన్స్ అధికారులు

నగరంపాలెం: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డీలర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గుంటూరు ప్రాంతీయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు ఏటీ అగ్రహారం 19/1 అడ్డరోడ్డులోని చౌక ధరల దుకాణంలో అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. రికార్డు ప్రకారం 100 బస్తాల కన్నా అదనంగా 230 బస్తాల బియ్యాన్ని గుర్తించారు. అక్రమంగా నల్లబజారు తరలించేందుకు డీలర్ నిల్వ చేసినట్లు విచారణలో బహిర్గతమైంది. డీలర్ ఉగ్గం శకుంతలపై 6–ఎ, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానిక పౌరసరఫరాల శాఖ ఉప తహసీల్దార్‌ను ఆదేశించారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐలు ఎ.శ్రీహరిరావు, ఎస్.శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



గుంటూరు ఈస్ట్: వ్యక్తి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్ 7వ లైనులో నివసించే బి.ప్రభుకిశోర్ రెండు రోజుల కిందట ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 6304572079 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

మహా కుంభాభిషేకానికి సర్వం సిద్ధం



మహా కుంభాభిషేకం ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

పొన్నూరు: పట్టణంలో 15 వందల సంవత్సరాల చరిత్ర కలిగిన అతి పురాతనమైన స్వయం వ్యక్త క్షేత్రంగా స్వర్ణపురి (పొన్నూరు)లో వేంచేసి ఉన్న శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావన్నారాయణ స్వామి దేవస్థానంలో ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించనున్న స్వామి అష్ట బంధన మహా కుంభాభిషేక మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆధ్వర్యంలో ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు పరాశరం రఘునాథబాబు పర్యవేక్షణలో 27న ఉదయం 8 గంటలకు విష్వక్సేన ఆరాధన పుణ్యాహం ఆచార్యాది రుత్విక్‌కరణంతో ఉత్సవ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. 28న ఉదయం 8 గంటలకు విష్వక్సేన ఆరాధన, కుంభ ఆరాధన, హోమం, సాయంత్రం 4 గంటలకు మహా శాంతి అభిషేకం, శాంతి హోమం గ్రామ బలి నిర్వహణ జరగనుంది. 29న తెల్లవారుజామున 5 గంటలకు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహం, అగ్ని ఆరాధన, కుంభ ఆరాధన, ఉత్త హోమం, శ్రీ భావనారాయణ స్వామి, రాజ్యలక్ష్మి అమ్మవారు, చెన్నకేశవ స్వామి, లక్ష్మీ నరసింహస్వామి, దాసాంజనేయ స్వామి, విభనసాచార్య స్వామి, రామానుజాచార్య స్వామి వార్లకు ఉదయం 9 గంటల ఐదు నిమిషాలకు కుంభాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం, అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని నిర్వహణ కమిటీ సభ్యులు కోరారు.

'చలపతి' కళాశాలలో ముగిసిన ఫార్మసీ వారోత్సవాలు



విజేతలతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఫార్మసీ వారోత్సవాల వల్ల విద్యార్థులంతా ఔషధాలపై అవగాహన కలిగి ఉంటారని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు అన్నారు. నగర శివారులోని లాం నందున్న కళాశాలలో జరుగుతున్న 62వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్యులు రోగి రుగ్మతను కనిపెట్టి ఔషధాలను సూచిస్తారని, వారికి తగిన సూచనలు చేసే బాధ్యత ఫార్మసిస్టులదేనని తెలిపారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీల్ని నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషిస్తున్న మహిళలు



మాట్లాడుతున్న చిగురుపాటి నరేష్

గుంటూరు ఎడ్యుకేషన్: అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో తొలి అడుగులు మహిళలవే అని విద్యావేత్త, కమ్యూనిటీ బిల్డర్స్ మేనేజింగ్ డైరెక్టర్ చిగురుపాటి నరేష్ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థినులకు స్వాగతం పలుకుతూ దీక్షారంబ్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా, స్ఫూర్తివంతంగా నిర్వహించారు. నరేష్ మాట్లాడుతూ మహిళ విద్యావంతురాలయితే మూడు తరాలు అభివృద్ధి చెందుతాయన్నారు. స్ఫూర్తిదాయకులైన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ములను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అవాంతరాల్ని అధిగమిస్తూ, అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటూ, అనుకున్న లక్ష్యాల్ని సాధించాలని తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయవాది మన్నవ ఆర్‌కేఎం షోడేకర్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ ముందున్న బాధ్యతల్ని గుర్తెరిగి నడుచుకోవాలని సూచించారు. ఏడో అడిషనల్ సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ.జ్యోత్స్న మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన ప్రభుత్వ మహిళా కళాశాల తనలాంటి వేలాది మంది పూర్వ విద్యార్థినుల జీవితాల్లో వెలుగులు నింపిందని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్.జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ తమ కళాశాలలో డిగ్రీ, పీజీ స్థాయిలో ఉద్యోగాల సాధనే పరమావధిగా నిష్ణాతులైన అధ్యాపకులతో ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో స్టూడెంట్ యూనియన్ కన్వీనర్ కె.సుబ్బరత్నం, స్టూడెంట్ యూనియన్ అధ్యక్షురాలు కె.ప్రియశ్రీ , డాక్టర్ పి.విజయలక్ష్మి, డి.ఉమ, టి.ప్రణయజ, ధాత్రికుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాలకుటీర్‌లో లలిత కళా ఉత్సవ పోటీలు ప్రారంభం



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్‌లోని శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్‌లో శనివారం లలిత కళా ఉత్సవంలో భాగంగా మొదటి విడత రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కవిత, కథ, లేఖారచనతో పాటు మధ్యాహ్నం చిత్రలేఖన పోటీల్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 35 పాఠశాలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎన్. మంగాదేవి తెలిపారు. విద్య అంటే పుస్తక పరిజ్ఞానం ఒకటే కాదని, కళలు సైతం అందులో ఒక భాగమేనని చెప్పారు. బాలల్లోని సృజనాత్మకతను వ్యక్తీకరించేందుకు, మానసికోల్లాసానికి లలిత కళలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. బాల్యదశ నుంచే కళలపై ఆసక్తి కలిగించినట్లయితే బాలలు సున్నిత భావాలతో ఎదిగి, విలువలను అలవర్చుకొని మంచి పౌరులుగా సమాజంలో నిలబడగలుగుతారని వివరించారు. డిసెంబరు 10న సంగీతోత్సవంలో భాగంగా బాలలకు గాత్రం, వాద్యం, బృందగాన పోటీలు నిర్వహిస్తామని, అదే రోజు సాయంత్రం లలిత కళా ఉత్సవంలో రచయితలకు పురస్కారాలు, రాష్ట్ర స్థాయి పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని ఆమె వెల్లడించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



రోడ్డును పరిశీలిస్తున్న నూరిఫాతిమా

పట్నంబజారు: తూర్పు నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 13వ డివిజన్, గుంట ఫ్యాక్టరీ రోడ్డులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణ పనుల అంశంలో చేసిన తప్పుల వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తి స్థాయిలో నగరాభివృద్ధి జరుగుతోందని తెలిపారు. రూ. 20 లక్షలతో రోడ్డు నిర్మాణం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సంకూరి శ్రీనివాస్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

స్వచ్ఛంద వైద్య సేవలపై అవగాహన ఒప్పందం



డాక్టర్ రఘు నుంచి ఒప్పంద పత్రాన్ని అందుకుంటున్న ఎస్వీ రమణ

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని ప్రభుత్వ ఛాతీ, సాంక్రమిక వ్యాధుల ఆస్పత్రితో స్వచ్ఛంద సేవలకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. రఘుతో జరిగిన చర్చల అనంతరం శనివారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. డాక్టర్ ఎస్. రఘు మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థ అనుభవం విద్యార్థులు పాఠ్యాంశాలకు సంబంధించిన విజ్ఞానం, నాయకత్వ లక్షణాలు, సామర్థ్యాల్ని పెంపొందించుకోవడంలో సహాయ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి పాల్గొన్నారు.

కాలుష్య భూతాన్ని నియంత్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పర్యావరణ ఉద్యమ ప్రచారకుడు నారపరెడ్డి

లక్ష్మీపురం: ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న కాలుష్య భూతాన్ని నియంత్రించాల్సిన అవసరం ఎంతైయినా ఉందని ప్రముఖ పర్యావరణ ఉద్యమ ప్రచారకుడు టి.నారపరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణంపై సాధారణ ప్రజల్లో అవగాహన పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సూచించారు. నిబంధనలు, చట్టాల్ని త్రికరణశుద్ధిగా అమలు చేయక పోవడంతో పర్యావరణం విషతుల్యంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సంస్థ సభ్యులు ఆర్.వెంకటరత్నం మాట్లాడుతూ ఢిల్లీలోనే కాదు దేశంలోని అనేక నగరాల్లో కాలుష్య పరిస్థితి ప్రమాదకర స్థాయికి చేరుకుంటుందన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

చిప్స్‌లో ముగిసిన జాతీయ ఫార్మసీ వారోత్సవాలు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో లక్ష్యసాధన దిశగా కృషిచేయాలని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విద్యాధర్ అన్నారు. చౌడవరంలోని కళాశాలలో ఐదు రోజులుగా కళాశాల, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ ఫార్మసీ ఉత్సవాలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నూతన పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలని చెప్పారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ హెల్త్ ఎడ్యుకేషన్ బాడీ సభ్యుడు డాక్టర్ పి.ఉమాశంకర్ ఆరోగ్య రక్షణ విధానాలను వివరించారు. విద్యార్థులకు బ్లడ్‌గ్రూప్, మధుమేహ టెస్టులు చేశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జె.సుబ్బారావు విద్యార్థులతో కలసి ఓబులునాయుడుపాలెంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్. కురువిళ్ల పాల్గొన్నారు.